పాలడుగు
వెంకటేశ్వరరావు





ఉదయం నుంచి నాలో అశాంతి, ఆవేదన. ఎంత వెదికినా కారణం కనుపించదు, చిత్రంగా!

ఈ రోజు నేను వచ్చేటప్పటికి బాగా ప్రొద్దుపోయింది.

కాతాదార్ల దగ్గర కలెక్షన్లు చెయ్యటమంటే సామాన్యమయిన విషయం గాదు. దానికి ఎంతో ఓర్పూ, నేర్పూ కావాలి. మా సేటు డబ్బు దగ్గర చాలా కచ్చితమయిన మనిషి. ఫలానా తారీఖు లోగా పని పూర్తి కావాలంటే అయి తీరవలసిందే ఇది వ్యాపారం మరి! ఈ వేళటితో నా పని పూర్తి అయిపోయి వచ్చే. సేటు ఫిక్సు చేసిన తారీఖు రేపు ఇవ్వాళటి దినం కలెక్టు చేసినది, ఈవేళ వేది కలిపి గల్లు కట్టేస్తే ఈ నెలకి నా పని పూర్తవుతుంది.

బట్టలు మార్చుకుని ఉస్సూరంటూ కుర్చీలో కూలబడ్డాను. చొక్కా జేబు బరువుగా కనిపిస్తూ ఉంది. అందులోని



సైకిలు తీసి పెట్టెలో భద్రం చేద్దామనుకున్నా, ఓపికలేక ఆ పని విరమించుకున్నాను.

అంతలో అక్క వచ్చింది.

"ఇంత ఆలస్యమయిందేంరా?" అంది ఎటో చూస్తూ.

"డబ్బుతో పనిగద? అంత తొందరగా తెములుతుందా?" అన్నాను నవ్వి.

"సరే. రా మరి, అన్నం వడ్డిస్తాను" అంది అక్క.

తువ్వాలు భుజాన వేసుకుని మొహం కడుక్కుని వచ్చాను.

మోహన్ గదిలో లైటు వెలుగుతూనే ఉంది ఇంకా.

"మోహన్ వచ్చాడా?" అని అడిగాను పీటమీద కూర్చుంటూ.

"ఆఁ ఇందాకే వచ్చాడు. అన్నం తిని చదువుతో పడ్డాడు. పరీక్షలంటగా?"

"ఈసా రయినా పాసవుతా డటనా?" అన్నాను, అన్నం కలుపుకుంటూ.

"ఏమో? అవుతా నంటున్నాడు. భగవంతుడు దయతలిచి నా డొక్క దారిన పడి నీ అంత వాడయితే — అంతకంటే నే నింకేమీ కోరుకోనురా" అంది అక్క.

"అవుతాడులే, అక్కా, ఏదో కుర్రతనం. మెల్లిగా వాడే గ్రహించి దారిన పడతాడులే. ఆ నమ్మకం నా కుంది. ఎందుకంటావా? వాడు నీ కొడుకు గనక." తల వంచుకుని చెప్పుకుంటూ పోతున్నాను, తింటూనే. నా ఆలోచనలు మాత్రం అక్క చుట్టూరానే పరిభ్రమిస్తున్నాయి.

మా అక్క మీద నా కా విశ్వాసం ఉంది.

ప్రేమ ఉంది. గౌరవం ఉంది. మా అక్క నిజంగా దేవతే.

నేను తల్లిని ఎరగను. మా నాన్నకి ఇంటి బాధ్యతలు పట్టి మా బాగోగులు విచారించిన సందర్భాలు నా ఎరుకన లేవు. ఆయన ఒట్టి మొరటు మనిషి. ఏ మాత్రం వంక దొరికినా అలుసుగా ఉన్నాను నా వీపు పగలేసేవాడు. తను నన్ను కన్నాడు గనక నా మీద ఆయనకి ఆ హక్కు ఉందని ఆయన నమ్మకం. ఆయనకి ఊరినిండా అప్పులుండేవి. పేకాడి డబ్బులు పోగొట్టుకునేవాడు. తగాదాలు పెట్టుకుని అల్లరిపడేవాడు. బయట అవమానం పొంది, ఇంటికి వచ్చి ఆ చిరాకువంతా ఇంట్లో వాళ్ళమీద చూపించేవాడు. నాకు సరిగా తెలియదు గాని, అమ్మ ఉన్నంతకాలం ఆయన వల్ల నరక యాతన అనుభవించిందని అంటారు. పుణ్యాత్మురాలు. పీడ వదుల్చుకుని పుస్తెలతో ఆవిడ వెళ్ళిపోయింది.

అప్పట్నుంచి అక్క చేతుల్లోనే నేను పెరిగాను. ఆ చేతులతోనే అందించిన గోరుముద్దలు తిన్నాను. ప్రేమ, ఆదరణ, ఆప్యాయత అనేవి అక్కనుంచే నేను తెలుసుకున్నాను.

అక్క ఆడపిల్ల గనక ఆవిడని తిట్లతోనే సరిపుచ్చే వాడు నాన్న. ఆమాత్రం సంస్కారం అయినా మిగుల్చుకున్నందుకు ఆయన్ని అభినందించుకోవలసిందే. ఆయన తన కోపతాపాల్ని తీర్చుకునేందుకు నేను ఒకణ్ణి దొరికాను బలిపశువు లాగా.

వీలు దొరికితే చాలు, నా వీపు చీల్చి వదిలి పెట్టేవాడు ఆయన. "పుట్టగానే తల్లిని మింగిన శనివెధవా" అంటూ నా మీద తన కసిని తీర్చుకునేవాడు ఆయన. అక్కడికి ఆవిడ బ్రతికున్న రోజులలో తను ఆమెని పువ్వులలో పెట్టి చూసుకున్నట్టు.

అక్క నన్ను రక్షించటానికి తెగ ఆదుర్దా పడిపోయేది.

"తమ్ముడూ! నాన్న వస్తున్నాడు" అని నాకు వార్నింగు ఇచ్చేది. చదువుతున్న పుస్తకాల్ని అవతల పెట్టి నిద్ర నటించే వాణ్ణి.

"ఏడీ? ఆ శనివెధవ ఏం చేస్తున్నాడు?" అంటూ గర్జించేవాడు నాన్న.

"నిద్రపోతున్నాడు, నాన్నా" అనేది అక్క.

"చదువూ, చట్టుబండలూ లేదా? ఇటు తీసుకురా బండ వెధవని. తోలు వలిచేస్తాను."

"పాపం, నాన్నా! ఇప్పటిదాకా చదివి చదివి అలిసిపోయాడు. నిద్రలేపి నిన్ను చూపిస్తే జడుసుకుంటాడు."

"నీ మొహం కాదూ. వెధవమొహం నువ్వూ! అసలు వాణ్ణి అట్లా తయారు చేసింది నువ్వు కాదూ?" అంటూ తిట్టుకుంటూ, పెట్టింది తిని పడుకుని గుర్రు కొట్టేవాడు నాన్న. అక్కడికి ఆ రోజుకి ఆ గండం గడిచిపోయేది.

కాని, దిన దిన గండం నూరేళ్ళాయుష్షు అని గండాల మధ్య బండగా పెరిగాను నేను. మరల తెల్లవారకుండానే ఆయనకి ఎదురు పడకుండా పోవాలని ఉడాయించేవాణ్ణి. ఆయనకి వివిధ వ్యాసంగాలు. ప్రొద్దుటే అన్నం తిని చీకటి పడేవరకూ తిరుగుతూ ఉండేవాడు. అది నాకు తెరిపి ఇచ్చేది. అయినా, ఏ దుర్ముహూర్తాన ఆయన కంట పడతానో అని గుండెలు పీచు పీచుమంటూనే ఉండేవి నాకు.

కొంతమంది భయంతోనే పుడతారు. భయపడుతూ బ్రతుకుతారు. నేను అటువంటి వాణ్ణి. అది నా రాత. అయితే, నా అదృష్టం ఏమంటే, పుట్టగానే నన్ను నిలువెల్లా ఆవరించిన ఆ భయంకరమయిన వాతావరణం నాలో మొండితనాన్ని, బండతనాన్ని పెంచింది. బండగానే బ్రతికాను. బ్రతికి బట్టకట్టి పెరిగాను మొండిగానే.

ఒకసారి జతగాళ్ళతో చెరువులో ఈతలు కొడుతూ ఆయన కంటపడ్డాను. ఆయన పేకాటలో డబ్బు పోగొట్టుకుని చిరాకుగా ప్రళయ రుద్రుడి వలె వస్తున్నాడు.

"ఒరేయ్, వెధవా! ఇటు రారా!" అని గర్జించాడు.

ఆ గర్జనకి నా జతగాళ్ళందరు మొండి మొలలతోటే అవతలి గట్టు ఎక్కి అటునించి అటే ఉడాయించారు. 'కాసబియాంకా' వలె నేనుమాత్రం బండగా ఆయన్ని ఎదుర్కొన్నాను.

ఆ రోజు రౌరవ నరకమంటే ఏమిటో నాకు తెలిసి వచ్చింది.

వీపు పేలిపోయి రక్తం చిమ్మింది.

"దరిద్రపు వెధవా! బ్రతకాలని లేదటరా? చావాలని ఉందటా?" అంటూ నన్ను చావగొట్టాడు ఆయన. కొట్టి కొట్టి చేతులు నొప్పెట్టి, గదిలో స్తంభానికి కట్టి తాళం వేశాడు. ఆ గదికి కిటికీలు మూయటం మాత్రం మరిచిపోయాడు.

"నాలుగు రోజులు వాడికి నీళ్ళు కూడా ఇవ్వకు. జాగ్రత్త" అంటూ అక్కని హెచ్చరించాడు.

నా గురించి ఏడ్చి ఏడ్చి అక్క కళ్ళు ఉబ్బిపోయాయి. కాని, ఏం చెయ్యగలదు అక్క?

నాకోసం ఏడ్చిన అక్కని చూసి నాకూ ఏడుపు వచ్చింది.

"అక్కా! ఎందుకే ఏడుస్తావు?" అన్నాను నా ఏడుపుని కనపడనీయకుండా.

"తమ్ముడూ! నాన్న నిన్ను బ్రతకనివ్వడు. కట్లు విప్పేస్తాను—ఎక్కడి కయినా పారిపోరాదూ?"

"అనే ఒరిగితే నాన్న నిన్ను బ్రతకనిస్తాడంటే?"

"పోన్లే, నేనే చస్తాను. అంతేనా?"

నాకు నవ్వు వచ్చింది. "పిచ్చి అక్కాయీ! నేను మొండి వాణ్ణే. అంత తేలిగ్గా చావనులే. నా గురించి బెంగ పెట్టుకోమాకు. నువ్వు సంతోషంగా ఉండు."

"ఏం చూసి సంతోషంగా ఉండమన్నా?" అంటూ బావురుమంది అక్క.

"ఏమేం ఫర్వాలేదు, అక్కా! వచ్చిన కష్టాలన్నీ పోతాయి. రోజులెప్పుడూ ఒకేలా ఉండవు. రాబోయే రోజులు మంచివన్న ఆశతో ఈ వేళ సంతోషముగా నేర్చుకో" అని నవ్వు మొహం పెట్టేవాణ్ణి అక్కకోసం.

అక్క అప్పుడు ఇదోలా చూసేది.

ఆ చూపు నేను జీవితంలో మరిచిపోలేనిది.

అందులో ప్రేమ ఉంది. దయ ఉంది. ఆదుర్దా ఉంది. యాతన ఉంది. గుండెలో పొంగిన అమృత ఝరులు ఆ చూపునిండా నిండి ఉండేవి. అది ఒక్క స్త్రీకే చేతనవు ననిపిస్తుంది ఇప్పుడు ఆలోచించి చూస్తే.

నాన్నకి తెలియకుండా, తెగించి కిటికీ లోంచి పచ్చడి ముద్దలు అందించేది అక్క. అవి తిని ప్రాణాలు నిలుపుకున్నాను. ఆ దెబ్బలు, గాయాలు, నొప్పులు—అన్నీ దేహాన్ని అనుభవించమని వదిలి అక్క వర్షించిన ప్రేమామృతంతో బతకటం నేర్చుకున్నాను అప్పుడు.


ఆ నాలుగు రోజులూ అట్లాగే ఉంచి, 'చస్తాడు వెధవ' అని దయ దలిచినట్లు నన్ను ఆ బంధనం నుంచి విడిచిపెట్టాడు నాన్న. ఆ మరుసటి సంవత్సరమే అక్క పెళ్ళి అయింది. అదీ ఆయన చేసిన ఘనకార్యం కాదు. నాన్న సంగతి తెలిసి అయిన వాళ్ళే ఆ పని చేశారు—ఈడొచ్చిన పిల్ల, బాగుండదు, వాడికి ఎట్లాగూ పట్టే చావదు — అని.

బావ మంచివాడు. ఇల్లరికం వచ్చాడు, నాన్న పట్టుదల వలన.

ఆయన వచ్చినాక ఇంటి పరిస్థితి మారింది.

నాన్నకి పక్షవాతం వచ్చి మంచం పట్టాడు. గత జీవితపు విలాసాలు ఆయన్ని ఆ రకంగా పడగొట్టి అంతటి మనిషిని నిర్వీర్యుణ్ణి చేశాయి. నాన్న చేసిన అప్పులన్నీ తీర్చి సంసారాన్ని ఒక రకంగా నిలిపాడు బావ. మోడువారి ఎండిన ఇంటి తీరు చిగిర్చి పచ్చగా రూపు దిద్దుకుంది.

నేను ఎస్. ఎస్. ఎల్. సి. పూర్తిచేసే సమయానికి మా బతుకుల్లో మరల చండతనం తొంగిచూసింది. అప్పటికి మోహన్‌కి మూడేళ్ళు. పాము కరిచి



**ఆలోకనం**

చిత్రం—డి. పండరి ( కరీంనగర్ )

బావ చచ్చిపోయాడు. గుండెలు పగిలేలా ఏడ్చింది అక్క. ఆ సమయంలో అక్కని ఓదార్చి కొండంత ధైర్యం ఇవ్వగల స్తోమతు నాకు అలవడింది. బండవాణ్ణి మరి.

అక్కడితో చదువు ఆపి, సంసారాన్ని బుజాన వేసుకుని జీవితాన్ని ఎదుర్కొన్నాను నేను. అంతులేని ఆరాటం, బతకటానికి పోరాటం. రకరకాల అయిన ఉద్యోగాలు చేశాను. పోయిన ఉద్యోగాల గురించి విచారించటం మాని, కావలసిన దానికోసం తీవ్రంగా కృషి చేశాను. కృషితో నాస్తి దుర్భిక్షం. ఉన్ననాడు తినటం, లేనినాడు పస్తులుండటం అలవాటయింది.

అన్ని కష్టసుఖాల్లోనూ ఒకటే ధ్యేయం.

మోహన్‌ని పెద్దవాణ్ణి చేయాలి. వాణ్ణే ప్రయోజకుణ్ణి చేసి అక్కని సంతోష పెట్టాలి. ఆ రకంగా కొంత వరకయినా అక్క ఋణం తీర్చుకోవాలి.

ఉన్నంతలో నా తండ్రికి ఏ లోటూ లేకుండా చూడాలి. నాన్నకి కాఫీ అలవాటుంది. రోజుకి ఇప్పటికీ మూడు పెట్టెలు చార్మినార్లు తాగుతాడు. ఏ రోజు అవి అమరవో ఆ రోజు నానా బీభత్సం చేస్తాడు.

ఒకొక్కరి తీరు అది. కొన్ని బతుకులు అలాగే వెళ్ళమారి పోతాయి. గతం గుర్తు చేసుకుంటే ఆయన మీద విరక్తి కలుగుతుంది. అసహ్యం అనిపిస్తుంది. ఎవరి కెవరు అనుకునే అవకాశం ఉంటుంది. కాదని తెంచుకుని బంధాన్ని ఛేదించవచ్చును. ఆయన నా కేమీ ఒరగపెట్టాడు గనక అన్న ప్రశ్న తల ఎత్తుతుంది.

కాని, ఆయన నా తండ్రి. ఆ సత్యం జ్ఞప్తికి వచ్చి ఆ తత్త్వం రూపుమాసి పోతుంది. బాధ్యత గుర్తుకి వచ్చి స్పర్ధ నశించిపోతుంది. ఆ ధోరణిని నేను అమలు జరిపితే అక్క మనసు క్షోభించి తీరుతుంది. మగవాడు క్షమని చూపించటానికి అశక్తుడయినా, స్త్రీ ఆ విషయంలో అపూర్వమయిన ధోరణి అనుసరిస్తుంది. మా నాన్న ఇంకా అన్ని వసతులు వర్తించుకుంటూ రాజయోగిలా చక్రం తిప్పటానికి అదే కారణం. మా అక్క కారణం. అందుకే అక్క దేవత అంటాను.

ఉన్నట్లుండి నేను తల పైకెత్తి అక్కని చూశాను, తినటం ఆపి.

కాని, అక్క మొహంలో ఆ చూపు! నేను జీవితాంతం జ్ఞాపకం పెట్టుకునే ఆ చూపు!

ఆ తీక్ష్ణతకి తట్టుకోలేక తల వంచుకుని, "ఏమిటక్కా! అలా ఉన్నావు?" అన్నాను.

"ఏం లేదురా. నీకో సంగతి చెప్పాలి" అంది గద్గదంగా అక్క.

"ఏమిటి చెప్పక్కా?"

"తరవాత చెపుతాలే. ముందు భోజనం కానివ్వు" అంది అక్క.

గబగబా భోజనం పూర్తిచేశాను. చెయ్యి తుడుచుకుని ఇవతలికి వచ్చాను.

ముసలాయన సకిలిస్తున్నాడు.

దాని అర్థం వేరే ఉంది. ఆయన నాతో మాట్లాడడు. నేను మాట్లాడించినా ఆయన బదులు పలకడు.

"నా కాఫీ, సిగరెట్లు తెచ్చి ఏడ్చావటోయ్?" అన్న ప్రశ్న ఆ సకిలింపులో ఉంది.

జేబులోంచి తీసి ఆయన కందించే వరకు ఆయన అలా సకిలిస్తూనే ఉంటాడు. ఆ పని జరగకపోతే అక్కని పిలిచి ఏదో పంకిన యుద్ధం పెట్టుకుంటాడు.

రెండు రోజులు కలిస్తే అప్పట్లు మోగుతాడు. ఆ మోతలు మనిషి యదార్థ, అయినవి మనసుకి రావు. అది నాకు, అక్కకి ఇష్టం లేదు.

అందువలన నాటిని ఆయనకి అందచేద్దామని బట్టల స్టాండు దగ్గరికి వెళ్ళాను.

మోహన్ గదిలో ఇంకా లైటు వెలుగుతూనే ఉంది.

మోహన్‌కి కూడా నా మీద కోపమే. అతను అంతా తాతగారి పోలిక.

అక్క నన్ను పెళ్ళి చేసుకోమని గత దశాబ్దంగా పోరుతూనే ఉంది. కాని, ఆ పని చేయటం ఇష్టంలేక దాటవేస్తూ వచ్చాను. దుర్భరమయిన నేటి పరిస్థితులలో అప్పుడే తొందరపడి కొత్త బంధాన్ని తెచ్చి పెట్టుకోవటం నాకిష్టం లేదు. మోహన్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి జీవితంలో ఒక దారినపడితే బాగుండునన్న ధ్యేయం ఒకటే నాకు ఉన్నది. అందుకనే, ఎన్ని కష్టాలు వచ్చినా ఓర్చి అయినా మోహన్‌ని కాలేజీలో చదివిస్తున్నాను. మోహన్ అవసరాల్ని వీలయినంత వరకు తీర్చటానికి ప్రయత్నిస్తున్నాను.

కాని, మోహన్ చూపు వేరుగా కనిపిస్తున్నది. 'మా మేనల్లుడు చెడిపోతున్నాడో' అంటారు నా స్నేహితులు. మూడు సంవత్సరాలనుంచి మోహన్ పరీక్ష పూర్తి చేయలేక పోతున్నాడు.

'ఇదేమిటిరా?' అంటానని అతనికి నా మీద కోపం. స్నేహితులు, సరదాలు—వీటిని కాదంటానని నాతో మాట్లాడడు మోహన్. అదేమంటే నోరు చేసుకుని అరుస్తాడు. 'నీ మంచికేరా, బాబూ' అని చెప్పినా, అందులో అతనికి చెడుగే కనిపిస్తుంది. ఒకసారి తెగించి అంత మాటా అన్నాడు మోహన్—'నా ఏడుపు నన్ను ఏడవనీ. నా గురించి నీ కెందు కంత బాధ? ఇంతగా రాచి రంపాన పెట్టటానికి అసలు నువ్వెవరు?' అని.

ఆలోచించి చూస్తే, వాడి అమ్మకి తమ్ముణ్ణవుతాను నేను. ఇప్పటివరకు వాడి బరువు బాధ్యతలు నెత్తిన వేసుకుని వాడి బాగు కోరేవాణ్ణి అవుతాను.

కాని, ఆ ఆలోచన ఏదీ వాడికి? ఆవేశం మాత్రం పుష్కలం.

అప్రయత్నంగానే జేబులో చెయ్యి పెట్టి వెతుకుతున్న నా చెయ్యి ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్టు వెనక్కి వచ్చింది. నేను ఇంటికి వచ్చి భోజనానికి కూర్చునే వరకు బరువుగా ఉన్న ఆ జేబు తేలిగ్గా, ఖాళీగా ఉంది.

గబగబా మోహన్ గదిలోకి వెళ్ళాను.

మోహన్ లేడు!

మంచంమీద చిందరవందరగా పెన్ను పుస్తకాలు, సినిమా మాగజైన్లు. "మోహన్, మోహన్!" అంటూ అప్రయత్నంగా పిలిచాను.

"ఏమిట్రా?"

వెనక్కి తిరిగి చూశాను.

నా వెనక అక్క నిలబడి ఉంది.

ఆవిడ చేతుల్లో బరువయిన మూట—గుడ్డ చుట్టి.

"డబ్బుకోసమేగా నువ్వు వెతుకుతోంట?" అని అక్క.

"అవు నక్కా. నువ్వు గాని తీసి నావా?" అంటూ తేలిగ్గా ఊపిరి పీల్చి తృప్తిగా చూశాను.

"అవున్రా. ఆ డబ్బు నేనే తీసి మోహన్ కిచ్చాను."

"ఏ డబ్బు?"

"అదే నిన్న నువ్వు పెట్టెలో దాచిన డబ్బు. 'అప్పులు చేశాను. వాళ్ళు ప్రాణాలు తోడుతున్నా'రని గొడవచేసి కన్నీరు పెట్టాడు. అందుకని ..."

"అక్కా ..."

"ఏమిట్రా?" అంటూ నన్ను చూసింది అక్క. ఆ చూపు అదే చూపు. జాలి, దయ, క్షమ, దీనత్వం-అనే నిండిన ఆ చూపు. ఆ తీక్ష్ణతకి తట్టుకోలేక తల వాల్చుకున్నాను.

"ఎందుకురా అంత ఆలోచన? తమ్ముడూ! రేపు ఈ వాట్ని తీసుకెళ్ళి అమ్మేసి డబ్బు తీసుకురా. అవసరం గడుస్తుంది గదా? తరవాత చూసుకుందాము లేరా." ధైర్యంగా అంది అక్క.

మూట వంక పిచ్చిగా చూస్తూ ఉండిపోయాను.

"ఏమిటి ఆలోచన?"

"ఏం లేదక్కా?"

"అయితే, ఎందుకు విచారం?"

ఆ నగలు గురించి నాకు తెలుసు. బావ ఉన్న రోజులలో అక్కకోసం మోజు పడి ఓపిక మేరకు వాటిని తెచ్చాడు బావ. ఇప్పుడు నేనూ బావతో ఉన్నాను. అవి గిల్టుగొల్టు నగలు! అవసరాన్ని ఆర్చగల, తీర్చగల సత్తా వాటికి లేదని నాకు మాత్రమే తెలుసు.

నా అవస్థకి బెంబేలుపడి కరిగిపోయింది అక్క.

"తమ్ముడూ! నన్ను క్షమించరా. కడుపు తీపి ఆపుకోలేక ఆ పని చేశానురా" అంటూ ఏడుస్తూ నన్ను కావలించుకుంది అక్క.

బొటబొటా కారే కన్నీరు తుడుచుకుంటూ అక్కని ఓదార్చటానికి ప్రయత్నం చేశాను.

"నాకు మోహన్ ఎంతో, నువ్వూ అంతేరా, తమ్ముడూ! మరి అలా అనుకోక పీటని అమ్మి అవసరం గడపరా" అంది అక్క, దీనంగా.

అక్కకి ఏం చెప్పను?

కర్కశ స్వరూపుడయిన సేట్ కళ్ళ ముందు మెదిలాడు. ఆయన ఊరుకోడు. పోలీసుల్ని పిలుస్తాడు. అల్లరవుతుంది. అవమానం తప్పదు.

తప్పదు. అందువలన నేనే వెళ్ళి ముందు బయట పడితే వీళ్ళ పరువు అన్నా దక్కుతుంది.

ముసలాయన ఇంకా వకిలిస్తూనే ఉన్నాడు.

ఆయన అవసరం అయినది.

ఆలోచనల నరికట్టి, అక్కను ఓదార్చి గబగబా ఆయన దగ్గరికి వెళ్ళాను. "నాన్నా! ఇదిగో మీ సిగరెట్లు, కిళ్ళీ" అంటూ అందించాను. ఆలస్యం అయిందేమన్నట్టు గుర్రుగా చూశా డాయన.

"వస్తాను, నాన్నా" అంటూ జీవితంలో మొదటి సారిగా రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేశాను. 'ఏడ్చావులే' అన్నట్టు విసురుగా చూసి తల తిప్పుకుని కిళ్ళీ బిగించా డాయన.

"వస్తా నక్కా" అంటూ అక్క పాదాలు అంటాను.

"ఇదేమిట్రా? ఎక్కడికిరా? నా మాట వినవేమిటి?" అంటూ గోల పెట్టింది అక్క. "ఏమిటి మాట్లాడవు? నా మాట వినకపోతే నన్ను చంపుకుని తిన్నంత ఒట్టు!" అంటూ శపించింది అక్క.

"నన్ను క్షమించక్కా. దానివలన ఉపయోగం లేదు. నేను ఎక్కడున్నా సంతోషంగా ఉండాలని ఆశీర్వదించు. నేనూ ఎక్కడ ఉన్నా, నీ గురించే తపిస్తూ ఉంటాను. నీ సంతోషమే కోరుకుంటాను. సుఖం మనకి ఎట్లాగూ రాసిపెట్టలేదు. కనీసం సంతోషంగా నయినా ఉండటానికి ప్రయత్నిద్దాము" అంటూ అక్క పాదాలని కన్నీళ్ళతో అభిషేకించాను.

కళ్ళెత్తి అక్క కళ్ళలోనికి చూడటం నా వశం కాదు.

ఆ చూపు నేను భరించలేను.

ఆ చూపులోని జాలి, దయ, క్షమ, దీనత్వం చూసి భరించే శక్తి నాకు లేదు.

"ఇదేమిటి, తమ్ముడూ! ? ఎక్కడికి వెళతావు? ఇప్పు డేమయింది?"

అక్కకి ఏం సమాధానం చెప్పను?

సేటుకి అప్పచెప్పవలసిన డబ్బు నిన్నటిది అక్క తనే అప్పచెప్పితే, ఈవేళటిది దొరవచేసి మోహన్ తనే సంగ్రహించుకు పోయాడనా?

ఆ కారణంగా నన్ను పోలీసులు పట్టుకెళ్ళి జెయిల్లో పెట్టి మక్కెలు విరగదన్ని కొంతకాలం అక్కడే కూర్చో పెడతారనా!

తనకి బావ ఇచ్చిన గిల్టు నగలు ఈ అవసరాన్ని తీర్చలేవనా?

రేపటినుంచి ఈ సంసారం ఏమవుతుంది అని బెంగపెట్టుకుని కుమిలిపోతున్నాననా?

వీటిలో ఏ సమాధానం చెప్పి అక్క మొహంలోకి చూడను?

చూసి— జాలి, దయ, సహనం, ప్రేమ, దీనత్వం నిండిన ఆ తీక్ష్ణతని తట్టుకుని ఎలా నిలబడగలను?

విధిచేత తొలుతనే నిర్దేశింపబడిన ఈ కఠోరమయిన జీవన గమనాన్ని ఏ రకంగా మార్చేటట్టు? ఇప్పటికే 'ఎవ్వడ్రా నువ్వు?' అన్నట్టు చూసి విదిలిస్తాడు నాన్న. 'అసలు నువ్వెవరు? నన్నిలా ఎందుకు సతాయిస్తావు?' అంటూ ఆవేశంతో ఆక్రోశిస్తాడు మోహన్. అని తెలుసుకుంటే అనిపిస్తుంది— స్వార్థమయిన అనుబంధాన్ని పెంచుకొని, వాటిని నిలుపుకోవటానికి అవస్థలు పడటమే గాని, అసలు ఈ జగత్తులో ఎవరి కెవరు? అని.

కాని, అక్కా—

ఈ శరీరంలో జీవు డుండేవరకు నేను ఒక సంగతి మాత్రం మరిచిపోను. ఒకరి కొకరు ఏమీ కాదని ఎవరు ఏమి ఘోషించినా- నాకు నువ్వూ, నీకు నేనూ ఏదో అవుతామని దయ నిండిన నీ చూపు చెపుతూనే ఉంటుంది నాకు.

ఆ చూపే నా మీద అమృతం వర్షించి ఎటువంటి పరిస్థితులనయినా ఎదుర్కొగల ధైర్యాన్ని ప్రసాదిస్తుంది. వస్తా నక్కా. త్వరలోనే మరల నీకోసమయినా తిరిగి వస్తాను. అంతవరకు నన్ను క్షమించి సెలవిచ్చి, దీవించి, పంపించు.

హృదయాన్ని బద్దలు చేస్తూ ఉన్న ఈ ఘోష నా పెదాలు దాటి బయటికి రాలేకపోయింది. 'అక్కా' అన్న గద్గద పూరితమయిన ఆ పలుకుమాత్రమే నా నుండి వెలువడింది.

చీకటిలోనికి, అనుకున్న గమ్యంవైపు అడుగు వేశాను.

వెనక్కి తిరిగి చూసే ధైర్యం నాకు లేదు. ఆ చూపు నన్ను వెన్నాడుతూనే ఉంది; ఉంటుంది. చీకట్లో కూడా వెనుదిరిగి చూసి ఆ వెలుగుల్ని తట్టుకో గల శక్తి నాకు లేదు. ★



మాం పాహి!

ఫొటో—ఎ. ఉమారాణి (విశాఖపట్నం)